# అసహాయ జీవితగాథ

సి. హెచ్. కనక ప్రవాసి

అంతవరకూ మా సీతకూ ఆ అమ్మాయికీ మధ్య సంభాషణ చాలా సరదాగానే నడిచింది. వాళ్ళంతవరకూ పుట్టుకల నుంచి పెళ్ళిళ్ళవరకూ విచిత్ర వివాహాలనూ, విడాకుల్ని గూర్చి అకస్మాత్తుగా చావటాల వరకూ సమీక్షించి వదిలారు. ఎప్పుడు మొదలుపెట్టిందో ఆ కథ చెప్పటం, ఆ అమ్మాయి చెబుతూంది. మా సీత వింటూంది.

"మా అమ్మ మా నాన్నకి మూడో పెళ్ళి పెళ్లాం. నేను పుట్టిన అయిదోఏట మా నాన్న చచ్చిపోయాడు—ఇలా వుండగానే నాకు పధ్నాలుగేళ్లు వచ్చాయి. మా నాన్న పోవడంచేతా, మా సంసారం చాలా దుర్దశలో వుండటంవల్లా, అసలు మా అన్నయ్యకు ప్రపంచజ్ఞానం తక్కువవల్లా, నా పెళ్ళివిషయంలో శీతకన్ను పడింది. ఏదో వేళకింత తినటం మాయింటి ప్రక్క వారింట్లో ఏ లేసో అల్లుకుంటూ కూర్చోడం. వారమ్మాయి కూడా చదువుకుంటున్నదీ, చనువైన మనిషి. వాళ్ళ అన్నయ్య కూడ చాల మంచివాడు. మొదట్లో కొద్దిగా చలించినా పరిస్థితులు అర్థం చేసికొన్నాక, చెల్లెలు మాదిరిగానే చూచేవాడు. ఒక్కొక్కప్పుడు వాళ్ళింట్లోనే సర్వమూను. వాళ్ల అమ్మా, నాన్నా నన్ను ఎంతో ఆదరంగా చూచేవారు. ఇట్లావుంటూనే కొంచెం ఇంగ్లీషు నేర్చుకున్నా. 'ఈడొచ్చిన పిల్లకింకా పెళ్ళి పేరంటం లేదు' అని ఇరుగుపొరుగువాళ్లు అనటం మొదలెట్టారు. ఆదేశించగలరు కాని ఆచరించగలరా. అయిదారు నెలలు గడిచాయి. ఆ వేసవి సెలవలకి వాళ్ళ పెత్తండ్రిగారబ్బాయి వచ్చాడు. అతను అట్టే చదువుకోలేదు, కాని ప్రపంచానుభవం కలవాడు. అసలు వాళ్ళదీ ఆ వూరే గాని అతని చిన్నతనంలోనే వాళ్ళా వూరు వదిలేశారు. అతనికి ఇరవై యేళ్లుంటాయి. అతనా మూణ్ణెల్లూ అక్కడే వున్నాడు. అతడు కూడ మాటకలివిడైనవాడే కాని మా అన్నయ్యలా చిర్రుబుర్రుమనే రకం కాదు. అంతవరకూ అతనికి వివాహం కానట్లు మా స్నేహితురాలే ఏదో మాటలసందర్భంలో చెప్పింది. అతన్ని చూసిన మొదట్లోనే నా హృదయంలో అవ్యక్తమైన ఆశాభావం అంకురించింది. అక్కాయ్! నన్ను మీరేమన్నా, నాకెవరైనా మీరే కనక నా హృదయం విప్పి చెబుతున్నాను. అతను కూడా నా విషయంలో చాలాదయగా చూడటం ప్రారంభించాడు. మా స్నేహితురాలి అన్నగారి ద్వారా నన్ను గూర్చి తెలుసికొన్నట్లున్నాడు. వారిద్దరూ ఏమనుకున్నారో ఏమో ఓ రోజున నన్ను పిల్చి "చూడమ్మా! ఎంతకాలం ఇట్లా వుంటాం. మీ అన్నయ్య నీ విషయంలో అశ్రద్ధ వహిస్తే ఈ స్నేహితురాలూ అశ్రద్ధ వహిస్తుందా? జాత్యంతర, వర్ణాంతర వివాహాలే నిరాఘాటంగా సాగుతూంటే, శాఖాంతరమైతే పెద్ద బాధా? ఈ చిన్న వయస్సులో అజ్ఞాత జీవితం ఎంతకాలం గడుపుతావ్. నీకూ తోటివారిలా ఉండాలని వుంటుంది. అంచేత నీ కిష్టమైతే మా అన్నయ్య కిచ్చి పెళ్ళి చేయటానికి మా యింట్లో ఎవళ్ళకీ ఏవిధమైన అభ్యంతరమూ లేదు. వాడు కూడ సంస్కారాభిలాషి. వాడి మాటమీదే నిన్నిలా అడుగుతూంట. ఆలోచించుకో! ఇష్టమైతేనే. ఎంతకాలం అన్నగారింట్లో? ఇప్పటికే మీ అన్నయ్య నిన్నో పెద్ద భారంగా ఎంచుతున్నాడు కదా! నేనిట్లా అంటున్నానని నువ్వేమీ అనుకోకు! పరినయం కొద్దీ చెబుతున్నా" అంది స్నేహితురాలు. ఆప్తులకన్న అత్యంతాదరం చూపే ఆమె దగ్గర అసలు విషయం మనస్సు విప్పి చెప్పేశాను," అని చెప్పటం ఆపివేసిందా అమ్మాయి.

"తర్వాత! తర్వాత" అంది మా సీత ఆతురతగా. నేను వచ్చిన సంగతి అంతవరకూ ఆ యిద్దరికీ కూడా తెలీదు. గదిలో కూర్చుని శ్రద్ధగా చెవు లప్పజెప్పి వింటున్నా. మళ్ళీ చెప్పటం ప్రారంభించిందా అమ్మాయి.

"నీ ఉద్దేశం ఏమిటే అని అడిగింది మా స్నేహితురాలు 'సరోజా.' ఆ పిల్ల పేరు సరోజ, లెండి. 'ఒకవేళ నేను సరేనన్నా మా అన్నయ్య చంపెయ్యడూ. వాడికి పట్టింపు లెక్కువ' అన్నాను.

"మరి మీ అన్నయ్య కోపదారి అనీ, నీ విషయమే చూడడనీ అన్నావు. అలాంటప్పుడు అతని అభిప్రాయాలతో పనేమిటి?"

"అమ్మో-ఆ రోజుల్లో మా అన్నయ్యంటే ఇంట్లో అందరికీ భయమే. అయినా 'మా అమ్మతో రహస్యంగా మాట్లాడి చెబుతా' నన్నాను. 'ఐతే ఇంతకీ నీ కతన్ని పెళ్ళాడ్డం ఇష్టమేనా! సిగ్గుపడకుండా చెప్పు' మని ఒత్తిడి చేసింది సరోజ.

"నా యిష్టా యిష్టాలమీద నా జీవితం ఆధారపడి వుందా" అన్నాను.

"అది వేరు విషయం. నీ భావి జీవితం అంతా నీ యిష్టా యిష్టాలమీదే ఆధారపడివుంది. చెప్పూ. దాచకు అని ఎంతో బాధ్యతగల వ్యక్తిలా అడిగింది. అప్పట్లో నా హృదయానికి కలిగిన ఆనందానికి అంతులేదు. కళ్లంట నీరు కారుస్తూ ఇష్టమే అని ఎలాగో అన్నాను.

"ఐతే నువ్వు మాట్లాడకు. మా పెద్దన్నయ్యే మీఅమ్మతో ఈ విషయం మాట్లాడతాడు" అని లేచి వెళ్ళిపోయింది. ఆ మర్నాడు మా అన్నయ్య వూళ్ళో లేడు. మా అమ్మ నన్ను పిలిచి, రహస్యంగా జరగాలి తంతు - తతంగం కావలిస్తే తర్వాత చూడచ్చు- తెలిస్తే అన్నయ్య చంపేస్తాడు; అని మా అమ్మ నా వివాహానికి అంగీకరించింది.

"ఐతే మీ అమ్మ చాలామంచిదే" అంది మా సీత అడ్డంవచ్చి.

"ఆ వేళ మట్టుకే" అంది ఆ అమ్మాయి - "ఊఁ! తరవాత."

"సూత్ర ధారణాదికాలు ఏమీ లేకుండానే మనస్సులూ ఆత్మలూ కలుపుకోవటంతోనే వివాహం జరిగిపోయింది. వేసవికాలం అంతా హాయిగా గడిచిపోయింది. ఆ సంగతి మా యింట్లో అమ్మకి తప్ప ఇంకెవ్వరికీ తెలీదు. సెలవులు పూర్తికాగానే అతను (మా ఆయన) ఉద్యోగంకోసం వెళ్ళారు. సరోజ అన్నగారు మా అన్నయ్యకూడా చదువులకు వెళ్ళిపోయారు.

"వారం వారం మా ఆయన దగ్గర్నుండి వాళ్ళింటికి నాకు ఉత్తరాలు వస్తూండేవి-ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాననీ, భగవంతుడనుగ్రహిస్తే త్వరలో ఇద్దరం కలిసి ఒకేచోట ఉండొచ్చు ననీ, రాసేవారు. అలా నెల్లాళ్ళు గడిచాయి. ఈలోగా నాకు తెలీకుండా మా అమ్మ మా యింటి కెదురుగా వున్న ఓ బ్రాహ్మణ భృత్యుని ద్వారా మా శాఖవాడయిన ఓ నలభై యేళ్ళవాడికి నన్నిచ్చి వివాహంచేయ నిశ్చయించింది. తాంబూలాలు పుచ్చుకున్నాక నన్ను చూడ్డానికి వచ్చారు. ఆ వేళ నన్ను ఇల్లు కదలొద్దన్నారు. మా అమ్మ నన్ను ఎంతో సింగారించింది. ఎందుకని నేనడగలేదు. సాయంత్రం వారొచ్చి నన్ను చూచి వెళ్ళారు. ఇదేమీ సరిగా నాకర్థంకాలేదు. ఆ రాత్రి మా అమ్మ చెప్పింది. "ఆ వచ్చిన వారిలో పెద్దాయనకి నిన్నిచ్చి పెళ్ళిచేస్తున్నాం. ఎల్లుండి పెళ్ళి." నాకు ఒళ్లుమండింది. ఇది పరిహాసమా! నిజమా! "ఈ విషయం అన్నయ్యక్కూడా తెలుసు. నువ్వింకేం మాట్లాడకు" అంది మా అమ్మ. నాకేదారీ కనుపించలేదు. ఆవేళే మా స్నేహితురాలూ వాళ్ళంతా పెళ్లికెళ్ళారు. కొంతసేపు ఏడ్చి అప్పుడడిగాను- 'ఐతే ఆ పెళ్ళిమాటేమిటి?' అని.

"ఆ పెళ్లిసంగతి ఎవరికీ తెలియదుగా. అది వివాహమే కాదు నిజానికి. ప్రస్తుతం కాబోయే నీ మొగుడికి ముప్ఫైఎకరాల భూమి వుంది. ప్రస్తు



తంలో ఆయన రంగంలోదిగి నిర్వహించని పదవే లేదు వాళ్ల ప్రాంతంలో. మనిషిని చూశావుగా. ఆట్టే కాలం బ్రతకడు. ఆస్థి ఎట్లాగైనా మన పరమే. ఇంక నోరెత్తకు' అంది రౌద్రమూర్తి మా అమ్మ. ఆ క్షణంలో ఆత్మహత్య చేసికోవా లనిపించింది. కానిఆయనగారు నాకోసం ఏమవు తాడో అనిపించింది. ఇన్నాళ్లుగా నన్ను కని పెంచడం ఇందుకా అనుకున్నా. భారత స్త్రీ విధవయై ఇంట్లో పడివుండడానికా! జీవిత చతురంగ క్రీడలో నేనొక వస్తువునా అను కొన్నాను.

"తప్పిందికాదు వివాహం.ఆయనకది మూడో పెళ్ళి. ఆ మరునాడే కార్యం. ఆత్మ తిరిగితిరిగి దూషించింది. మనస్సు వెనక్కు లాగింది. తిర స్కారం విరుచుకు పడ్డది నలుమూలలనుండీ. ఒంట్లో బాధగా వుందని తప్పించుకొన్నాను మూడురోజులూ. తిండీ తిప్పలూ సరిగా లేక పోవటంవల్ల మంచానపడ్డాను. పెళ్ళివారు వెళ్ళి పోయారు. వారం రోజులు తర్వాత మా అన్నయ్యవచ్చి "అత్తింటికి నడు"అన్నాడు. అసలు విషయం వాడికప్పడు చెప్పక తప్పింది కాదు. నన్ను చంపుదామన్నంత కోపంవచ్చింది వాడికి. "వంశ గౌరవం నాశనం చేశావు వెధవా అయిందేదో అయిందన్నాడు" ససేమిరా నేను కదలనన్నాను. ఆనాటివాడి రాక్షస ప్రవర్తన తలుచుకుంటేభయంవేస్తుంది."వచ్చేదశమినాడు ప్రయాణం. ఎవడి కోసం వెళ్ళదో, ఎవరడ్డ మొస్తారో చూస్తా"నన్నాడు. తిరిగి చదువు కెళ్ళిపోయాడు. పెండ్లినుండి తాగానే సరో జకు ఈ విషయం అంతా చెప్పాను. చాలా అసహ్యించుకుంది. తిట్టింది మాఅమ్మనీ, వాళ్లనీ కూడా. వాళ్ళఅన్నగార్లిద్దరికీ ఉత్తరంవ్రాసింది. మూడోనాటికల్లా వాళ్ళిద్దరూ వచ్చేశారు.

ఆయనవచ్చి మా అమ్మతో "ఏమిటీ గోల" అని అడిగారు. మా అమ్మ పెంకెగా సమా ధాన మిచ్చింది. అక్కడనుండి బయలుదేరి వెళ్ళి మా అన్నయ్యతో చెప్పారు. వాడు మరీ అల్లరి పెట్టాడట. ప్రయాణం నాటికి వాడికి రావటానికి తీరుబడిలేక మా అమ్మనే తీసుకెళ్ళమని రాశాడు. తప్పనిసరిమీద బండె క్కాను. మా ఆయనకూడా వచ్చారు రైల్వే స్టేషనుకు. నిడదవోలు - గుడివాడ పోయేబళ్లు వచ్చాయి. మేం పోవలసింది నిడదవోలు. మా ఆయన మా అమ్మదగ్గరకు వచ్చి "మీ రాడ వాళ్ళు టిక్కెట్లు కొనుక్కోలేరు. నేను తెస్తా న"ని, రెండు గుడివాడ ఒక ప్లాట్ ఫారం టిక్కెట్టు తీసుకున్నారు. "ముందు పిల్లని ఆ ప్రక్కనుండి బండెక్కిస్తా మీరక్కడుండం"ని నమ్మించి మా అమ్మకు ప్లాట్ ఫారమ్ టిక్క ట్టిచ్చి నా సూట్ కేస్ పుచ్చుకొని నన్ను గుడి వాడ బండి యెక్కించారు. ఎక్కడం తడవుగా బండి కదలింది. "మరి మాఅమ్మో!"అన్నాను. "మీ అమ్మను పిలవడానికి సిగ్గయినా లేదూ! ప్లాట్ ఫారం టిక్కట్టిచ్చా- ఫరవా లేదులే" అన్నారు. ఆవెళ్లడం వెళ్లడం బందరు వెళ్లాం, బండి యెక్కుతూండగానే ఆయన తన స్నేహి తునితో 'మేమిద్దరం జెండా ఎత్తేశామని చెప్ప' మన్నారట మా అమ్మతో. ఆవిడ ఏడుస్తూ ఇంటికి పోయి మా అన్నయ్య మీద గొడవచేసినట్లు తరువాత నాకు తెలిసింది. ఆ మర్నాడు నన్ను అక్కడవుంచి మా అత్తారి వూరువెళ్ళి అసలు విషయం చెప్పారు. అప్పుడా ముసలాయన మావాళ్ళమీద ఉగ్రుడైనాట్ట- "ఆపిల్ల చాలా మంచిది. నువ్వు శంకించకు. ఈ తెరమరుగంతా నాకు తెలీదు, ఆఅమ్మాయి క్షేమంగా వుండటమే నేను కోరేది" అన్నాట్ట ఆ ముసలాయన. అట్లా హాయిగా గడుస్తూంది మా జీవితం అని నిట్టూర్చి, చెప్పటం ఆపుచేసింది ఆ అమ్మాయి.

"తరువాత ..." అడిగింది మా సీత.

"తరువాత జీవితమంతా మీకు తెలుసుగా. నడుస్తున్న జీవితం చూస్తున్నారుగా! 'ఇదో వింతగావుందికదూ మీకు" అని ఆదో రకంగా నవ్వింది ఆమ్మాయి. పూర్తి కథ వినగలిగా నన్నే తృప్తితో ఆవలిస్తూ లేచాను.